పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- ఎస్సీ శ్మశానవాటిక చుట్టూ చెత్త డంప్
- పూడికతీతకు నోచుకోని డ్రెయిన్లు
- నెలకు రూ.లక్షల్లో ఖర్చయినా ఎక్కడి సమస్య అక్కడే


రామవరప్పాడు ఎస్సీ శ్మశానం చుట్టూ పేరుకుపోయిన చెత్త కుప్పలు

రామవరప్పాడు: నగరానికి అతి సమీపంలో ఉన్న విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి నోచుకోని విధంగా తయారైంది. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకుపోతున్నా పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. మేజర్ పంచాయతీ కావడంతో నిత్యం గ్రామంలో టన్నుల్లో చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తను డంప్ చేయడానికి అనువైన స్థలం లేకపోడంతో బల్లెం వారి వీధిలోని ఎస్సీ శ్మశానవాటిక వద్ద డంప్ చేస్తున్నారు. ఫలితంగా రోజు రోజుకు చెత్త విపరీతంగా పేరుకుపోతోంది.

డ్రెయిన్లలో కదలని మురుగు

రహదారుల పక్కన డ్రెయిన్లలో మురుగు పారుదల సజావుగా లేకపోవడంతో పొంగి పొర్లుతున్నాయి. కొట్టివారి వీధి, హైస్కూల్ రోడ్డు, అంకిత అపార్టుమెంట్ పరిసర ప్రాంతాలు, కాల్వగట్టు ప్రాంతాలు, జాతీయరహదారి తరుచూ ముంపునకు గురి అవుతున్నాయి. ప్రధాన కూడళ్లు, అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లు అభివృద్ధికి నోచుకోకపోవడం ఇందుకు కారణం.

శ్మశానం చుట్టూ చెత్త డంప్

ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాలకు ఉన్న ఒకే ఒక్క ఎస్సీ శ్మశానం చుట్టూ రామవరప్పాడు పంచాయతీలోని చెత్తను డంప్ చేస్తున్నారు. గ్రామంలోని చెత్తను సేకరించి ఇక్కడ గుట్టలుగా పోస్తున్నారు. ఫలితంగా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త డంపింగ్‌తో అంతిమ సంస్కారాలు నిర్వహించుకోలేకపోతున్నామని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యానికి నెలకు రూ.లక్షల్లో ఖర్చు .. అయినా!

పంచాయతీకి సంవత్సరానికి సుమారు రూ.2కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. దీనిలో అధిక భాగం పారిశుద్ధ్య నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు. గ్రామంలో సుమారు 80 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని పర్యవేక్షించేందుకు నలుగురు సూపర్‌వైజర్లు ఉన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.14 వేలు, సూపర్‌వైజర్లకు రూ.16 వేల వరకు వేతనం చెల్లిస్తున్నారు. ఇలా నెలకు వీరికి వేతనాలు చెల్లించడానికే సుమారు రూ.14 లక్షలు ఖర్చు అవుతుంది. వాహన మరమ్మతులు, బ్లీచింగ్, పెట్రోల్, సామాన్ల కొనుగోలు వంటి మెయింటెనెన్స్‌కు నెలకు సుమారు మరో రూ.13 లక్షల ఖర్చు. కేవలం పారిశుద్ధ్య నిర్వహణకే నెలకు సుమారు రూ.30 లక్షలకు పైగా ఖర్చు అవుతోంది. సిబ్బంది బాధ్యతారాహిత్యం, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలోపం వల్లే పారిశుద్ధ్యం మెరుగుపడటంలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. పారిశుద్ధ్య, అభివృద్ధి పనులు ప్రధాన ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

చెత్త డంపింగ్‌కు అనువైన స్థలం లేదు..

గ్రామంలో చెత్త డంప్‌కు అనువైన స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ట్రాక్టర్లు, రిక్షాలను ఉపయోగించి చెత్తను తరలిస్తున్నాం. రోజుకు 8 నుంచి 10 టన్నుల చెత్తను గుంటూరు సమీపంలో జిందాల్ వద్ద డంప్ చేయిస్తున్నాం.

– సత్యంబాబు, పంచాయతీ కార్యదర్శి, రామవరప్పాడు

విఘ్నేశ్వరునికి పూజలు.. అన్నసంతర్పణలు


కంకిపాడులో పూజలు చేస్తున్న భక్తులు


ఉయ్యూరులో పూజలు చేస్తున్న భక్తులు


పల్లిపేటలో వినాయకుడి విగ్రహం


గన్నవరంలో ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో..

కంకిపాడు: జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తజనం గణనాథుడికి పూజలు చేస్తున్నారు. గణేష్ నవరాత్రుల్లో భాగంగా మూడో రోజైన శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ఆకృతుల్లో దర్శనమిచ్చిన విఘ్నేశ్వరుడికి భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కంకిపాడు విష్ణాలయం సెంటరులో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం చేయించారు. కార్యక్రమాన్ని దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ ప్రారంభించారు. కార్యక్రమాన్ని జై గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ పర్యవేక్షించింది.

ఉయ్యూరు: ఉత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం ఉయ్యూరులో వాడవాడలా కొలువుదీరిన గణనాథుడికి భక్తులు పూజా కార్యక్రమాలు జరిపించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉయ్యూరు పట్టణంలోని చింతలతోటలో నాగపడగల అలంకరణలో దర్శనమిచ్చిన గణనాథుడుకి వ్యాపారవేత్త బొల్లా నాని ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు గద్దం చైతన్య పాల్గొన్నారు.

పెనమలూరు: పల్లిపేట వినాయకుడి విగ్రహం వద్ద శుక్రవారం భారీగా పూజలు నిర్వహించారు. పల్లిపేట వినాయకుడి విగ్రం వద్ద శనివారం శ్రీనివాసకల్యాణం చేయనున్నారు. దాదాపు 25 జంటలు ఈ పూజలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. కానూరు సిరినగర్‌లో వినాయక ఉత్సవాలు విశేషంగా చేస్తున్నారు. పోరంకి గ్రామ దేవత గంగానమ్మ తల్లి గుడి వద్ద శివసతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమ పూజలు మహిళలు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం భక్తులను అన్నసమారాధన నిర్వహిస్తామని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

గన్నవరం: మండలంలో గణపతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం పలువురు దంపతులు పూజలు నిర్వహించారు. తొలుత గణనాథుడికి 27 రకాల ప్రసాదాలతో నివేదన జరిపారు. అనంతరం 300 మంది సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకుడు ఎస్. రామాచార్యులు, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో వినాయకునికి విశేష పూజలు జరిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గత మూడు రోజులుగా గణపతి ఉత్సవాలు ముగిశాయి. ఆర్టీసీ ఉద్యోగులు గణనాథుడిని ఊరేగింపుగా తీసుకువెళ్లి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. స్థానిక రాయ్‌నగర్, కేసరపల్లి, బుద్ధవరం, అల్లాపురం గ్రామాల్లో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు


అధికారులను సత్కరిస్తున్న ఈఓలు, సచివాలయ సిబ్బంది

గన్నవరం: స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అధికారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ యు.స్వర్ణలత, కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సీవీఎల్ఎస్ఆర్‌వీ. ప్రసాద్, ముస్తాబాద గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఎం.శామ్యూల్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. ఉద్యోగోన్నతి పొందిన డెప్యూటీ ఎంపీడీఓ రాజబాబు, గొల్లనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి మారుతీ ప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉద్యోగులు ఐకమత్యంగా పనిచేయడం ద్వారానే లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. అప్పుడే ఉన్నతాధికారులు తమ పనితీరును గుర్తించి సముచిత గౌరవం కల్పిస్తారని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవరావు, సాయిబాబు, ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు, పీడీ. శ్రీనివాస్, రత్నకర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పఠనాసక్తి పెంచుకోవాలి


సభ్యత్వ పత్రాలను అందుకున్న విద్యార్థులతో రోటేరియన్లు

గన్నవరం: విద్యార్థి దశ నుంచే పఠనాస్తిని పెంపొందించుకోవాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు జీవీ. రవిబాబు పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో శుక్రవారం రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు గ్రంథాలయంలో శాశ్వత సభ్యత్వం కల్పించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి వారంలో ఒక రోజైనా గ్రంథాలయాలను సందర్శించాలని చెప్పారు. అక్కడ ఉన్న పుస్తక సంపదను సద్వినియోగం చేసుకుని మేథోశక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ దిశగా విద్యార్థులను పోత్సాహించేందుకు రోటేరియన్ జాస్తి వెంకటకృష్ణారావు వంద మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వ రుసుం చెల్లించినట్లు తెలిపారు. ఈ అవకాశన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు కోరారు. పాఠశాల హెచ్‌ఎం ఎ.సునీల, గ్రంథాలయాధికారి కె.నాగరాజు, రోటేరియన్ జీ.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

పెనమలూరు: వణుకూరులో పాతగొడవల కారణంగా పరస్పరం దాడి చేసుకోవటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరు గ్రామం బీసీ కాలనీకి చెందిన నలుకుర్తి రవీంద్రకు అదే గ్రామానికి చెందిన శివకు పాత గొడవలు ఉన్నాయి. గతంలో రవీంద్రపై శివ కర్రతో దాడి చేశాడని పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసు విషయమై మరలా ఇద్దరూ తగాదాపడి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

రక్తమార్పిడిలో సాంకేతికతను అధ్యయనం చేయాలి

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో శుక్రవారం పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ విభాగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్ (ఎన్ఐబీ) సంయుక్త ఆధ్వర్యంలో హిమో విజిలెన్స్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ రక్త మార్పిడిలో వచ్చే ఆధునిక సాంకేతికతను వైద్యులు నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. ప్రతికూల చర్యలు, సమస్యలపై సమాచారం సేకరించటం చేయాలన్నారు. రక్తసేవలు, రక్త మార్పిడి విధానాలు నాణ్యతను పెంచాలన్నారు. రోగులలో ఫలితాలను మెరుగు పరచడానికి హిమో విజిలెన్స్ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. గౌరవ అతిథిగా బ్లడ్ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న, ఎన్ఐబీ హెచ్‌ఓడీ ఆకాంక్ష బిస్టు, అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్‌కుమార్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ నవీన్ చంద్ర, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ జాస్మిన్ సుల్తానా పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలుశిక్ష

గన్నవరం: చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. వివరాలీలా ఉన్నాయి. గన్నవరానికి చెందిన ఓ ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి లింగం కిరణ్ కుటుంబ అవసరాల నిమిత్తం 2022లో స్థానిక గాజులపేటకు చెందిన బొర్రా వెంకటాద్రి వద్ద రూ.9 లక్షల రుణం తీసుకున్నారు. తీసుకున్న అప్పులో కొంత భాగమైన రూ.7 లక్షలగాను బ్యాంక్ చెక్‌ను కిరణ్ 2024 మార్చి 20న వెంకటాద్రికి ఇచ్చాడు. అయితే సదరు బ్యాంక్ ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. దీంతో వెంకటాద్రి స్థానిక న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఈ కేసు విచారించిన స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు చెక్ బౌన్స్ నేరానికిగాను కిరణ్‌కు జైలుశిక్షతో పాటు జరిమానా విధించింది. ఈ మేరకు జడ్జి ఐ.శైలజాదేవి తీర్పు వెల్లడించి నట్లుగా పిటిషనర్ తరపు న్యాయవాది అన్నపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వివరాలు తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఓ వ్యక్తిని పాము కాటువేయటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాక గ్రామానికి చెందిన అమలాపురపు కిషోర్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఈ నెల 26వ తేదీన తాపీ పనులు చేసే ఫిర్యాది తండ్రి అమలాపురపు దుర్గారావు (57) ఇంటి ముందు రాళ్లు సర్దుతుండగా రాళ్ల కింద ఉన్న పాము అతని చేతిపై కాటు వేసింది. అతన్ని వెంటనే పెనమలూరు పీహెచ్‌సీకి తీసుకు వెళ్లి మెరుగైన వైద్యం కోసం విజయవాడ జీజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న దుర్గారావు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై కుమారుడు కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై దృష్టి పెట్టాలి

పెనమలూరు: విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై దృష్టి పెట్టాలని నాగార్జున యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు అన్నారు. ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఇంటర్నేషనల్ హ్యాకథాన్- 2025 కార్యక్రమంలో గురువారం ప్రసంగించారు. హ్యాకథాన్ విద్యారుర్థుల ప్రతిభను వెలికి తీయటంలో ఉపయోగపడుతుందన్నారు. నైపుణ్యాలు పెంపొందించుకోవటానికి, ఆధునిక సాంకేతికత వైపు దూసుకుపోవచ్చని తెలిపారు. వీఐటీ హెడ్ డి.నాగరాజు, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ఎస్.వెంకటసుబ్బారెడ్డి, ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ విష్ణుప్రియ, కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల రక్షణ అందరి బాధ్యత

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామ సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గంటెడి సుజాత నాయుడు, మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. దివ్యాంగుల హక్కులు రక్షణకై అందరం కృషి చేయాలని చెప్పారు. వారిలో సృజనాత్మకతను వెలికితీసే అవకాశాలు కల్పించాలన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు తిరువీధి వెంకులు బాబు, నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మందావేణు, అధికార ప్రతినిధి పచ్చిగళ్ళ భాస్కరరావు, నాయకులు దేవరపల్లి సురేష్, పులపాక మహేష్, కుమార్, బాబూరావు, కోట బాబూరావు, గుడ్డేటి అంజయ్య, పృథ్వీ, దివ్యాంగులు పాల్గొన్నారు.

వీఆర్‌కు హనుమాన్‌జంక్షన్ సీఐ, ఎస్ఐ

హనుమాన్‌జంక్షన్ రూరల్: పశువుల అక్రమ రవాణా విషయంలో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ, ఆత్కూరు ఎస్ఐ సీహెచ్ సురేష్‌లను వీఆర్‌కు పంపినట్టు తెలుస్తోంది. ఇటీవల ఆవులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని 16వ నంబర్ జాతీయ రహదారిపై ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు గోసంరక్షణ సమితి సభ్యులు పట్టుకున్నారు. దీంతో అక్రమ రవాణాదారులు, గోసంరక్షణ సమితి సభ్యుల మధ్య వివాదం రేగింది. ఈ వ్యవహారంలో ఎంటరైన పోలీసులు కాసులకు కక్కుర్తి పడి ఆవుల అక్రమరవాణాదారులకు కొమ్ముకాశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఎస్పీ ఆర్.గంగాధరరావుకు ఫిర్యాదులు అందటంతో ఆయన శాఖపరమైన విచారణకు ఆదేశించారు. అంతేకాక హనుమాన్‌జంక్షన్ సీఐ, ఎస్ఐలను వీఆర్‌కు పంపారు. ఆత్కూరు ఎస్ఐగా హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ-2 నరసింహమూర్తికి బాధ్యతలు అప్పగించారు.

నున్న జెడ్పీహెచ్ఎస్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు



నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర, జాతీయ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నున్న జెడ్పీ హైస్కూల్‌కు రాష్ట్ర స్థాయి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించినట్లు హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.రవిప్రసాద్ తెలియజేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ (క్రీడా ప్రతిభా పురస్కారం)ను సొంతం చేసుకొంది. ఎన్టీఆర్ జిల్లా స్థాయిలోనూ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ప్రకటిం చింది. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని శనివారం విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.రవిప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు టి.శ్రీలత, టి.విజయవర్మ అవార్డులను స్వీకరించనున్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైస్కూల్లో శుక్రవారం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్లను సత్కరించారు.

ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడమే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నాయని జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ పి.ప్రదీప్ కుమార్ అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ర్యాంప్ పథకం కింద 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్ వర్క్‌షాపును శుక్రవారం నిర్వహించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగాన్ని బలోపేతం చేయటం, కీలకమైన సవాళ్లను పరిష్కరించటం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ర్యాంప్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. 225 మంది యువ పారిశ్రామికవేత్తలకు ఈ వర్క్‌షాపులో 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, ధ్రువీకరణపత్రాలను పంపిణీ చేశారు. వీటి ద్వారా ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణాలు పొందవచ్చని తెలిపారు. బాపులపాడు ఇన్‌చార్జిఎంపీడీవో టి.త్రినాథరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఐపీవో మనో జ్, వెలుగు ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


క్రీడా జ్యోతి పట్టుకున్న బాడీ బిల్డింగ్ క్రీడాకారులు


క్రీడాకారులను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

పెనమలూరు: కానూరులో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగుభాషా దినోత్సవం ఘనంగా చేశారు. హాకీ క్రీడా మాంత్రికుడు మేజర్. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా కానూరు అశోక్ జిమ్‌లో క్రీడా జ్యోతిని ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు వెలిగించారు. తెలుగుభాషా పితామహుడు గిడుగు రామూర్తి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కానూరు పంట కాలువ నుంచి 2కేరన్ ప్రారంభించారు. బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాళ్లూరి అశోక్, మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ్ సభ్యులు, బాడీ బిల్డింగ్ కీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో..

కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా చేశారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ట్రాంపోలీన్ మహిళల వ్యక్తిగత విభాగంలో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎస్.ప్రగ్న, వీ.నీలవేణి రజిత పతకాలు సాధించారు. ఇద్దరు క్రీడాకారులను ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో ఉపకులపతి ఏవీ.రత్నప్రసాద్, పీడీ పి.రఘు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

మాతృభాషపై పట్టు సాధించాలి

మాతృభాషపై పట్టుసాధించాలని సాహిత్యవేత్త జీవీ.పూర్ణచంద్ అన్నారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవం చేశారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మాతృభాషను గౌరవించడం బాధ్యత


వీరవల్లిలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల, ఇతర ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు సాహిత్యం, వచనాలను వాడుక భాషలోకి తీసుకువచ్చేందుకు రామ్మూర్తి చేసిన కృషిని ఆమె విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయ కార్యదర్శి మానుకొండ రమణగోపాల్, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీ పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మాతృభాషను గౌరవించాలని చెప్పారు. దేశ భాషలందు తెలుగు ఎంతో గొప్పదన్నారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. తెలుగు అధ్యాపకులు కె. దుర్గాప్రసాద్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యకర్తల వెన్నంటి ఉంటా


కాళహస్తి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న చక్రవర్తి

కంకిపాడు: కార్యకర్తల వెన్నంటి ఉంటానని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవ భక్తుని చక్రవర్తి అన్నారు. కంకిపాడు, ప్రొద్దుటూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. కంకిపాడు 16వ వార్డు సభ్యురాలు కంకిపాటి జానకి తండ్రి కాళహస్తి మృతి చెందటంతో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పార్టీ నేత మల్లా బసవయ్య అకాలమరణం చెందటంతో భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు, కలపాల వజ్రాలు, భీమవరపు రాజగోపాల్‌రెడ్డి, గాదంశెట్టి పరమేశ్వరరావు, మాదు నాగహరీష్, షేక్ కరీముల్లా, బీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, యార్లగడ్డ సుందరయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీటీ.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉంగుటూరు, ఎలుకపాడు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, గారపాడు, పొణుకుమాడు, తుట్టగుంటపాడు, నాగవరప్పాడు, వెన్నుతల, వెల్దిపాడు, తరిగొప్పుల, వేంపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.